అధ్వానంగా రోడ్లు..!

చెన్నూర్ నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. కొన్నిచోట్ల గుంతలుగా మారగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా ఉండి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ప్రభుత్వాలు మారినా మారని రోడ్డు దుస్థితి
- పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు


వర్షాలకు కోతకు గురైన బీటీ రోడ్డు

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామానికి వెళ్లేందుకు చెరువు కట్టపై నుంచి ఏర్పాటు చేసిన ప్రధాన రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల-చెన్నూరు జాతీయరహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలంపల్లికి వెళ్లాలంటే, ఇప్పటికీ మెరుగైన రోడ్డు నిర్మించడంలో ప్రభుత్వం విఫలం చెందింది. జాతీయ రహదారి నుంచి కిలోమీటరు వరకు పంట పొలాలు ఉండగా, మరో కిలో మీటరు చెరువు కట్ట ఉంటుంది. ఈ చెరువు కట్టపై గల రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసినప్పటికీ రోడ్డు వెడల్పు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చెరువు కట్ట వెడల్పు చేయాలని గ్రామస్తులు అనేక సార్లు ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. గత ఎన్నికల్లో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెరువు కట్ట వెడల్పు చేసి, రెండు వరుసల రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆయన పదవీ కాలం పూర్తయినా కార్యరూపం దాల్చలేదు. గ్రామానికి వచ్చిన సుమన్‌కు ప్రజలు ఈ విషయంలో వినతిపత్రాలు ఇచ్చినా, ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు స్థానికులు తెలిపారు.

కంకర తేలి...

చెన్నూర్‌రూరల్: మండలంలోని కన్నెపల్లి గ్రామం నుంచి సంకారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డుపై కంకర తేలి అధ్వానంగా మారింది. రోడ్డుపై కంకర తేలడంతో గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని గుంతలు మరింత పెద్దవిగా కాక ముందే రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


కన్నెపల్లి నుంచి సంకారం వెళ్లే దారిలో వంతెన వద్ద అప్రోచ్ రోడ్డుపై తేలిన కంకర

మందమర్రిలో రోడ్డుకు పగుళ్లు


ఎస్సీ కాలనీలో పగుళ్లు ఏర్పడి అధ్వానంగా రోడ్డు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆ కాలనీల్లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రోడ్లు వేసి దశాబ్ద కాలం దాటితే, మరికొన్ని రోడ్లు కొత్తగా వేసినా క్వాలిటీ పాటించకపోవడంతో ముక్కలుముక్కలు గా పగిలి దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల విపరీతమైన గుంతలు, మిషన్ భగీ రథ పైపులైన్ కోసం తవ్విన కాలువలు సరి గ్గా నింపక పోవడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు. అభివృద్ధి పేరిట నూతనంగా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కాలనీలు తిరిగి అధ్వానమైన రోడ్లున్న చోట కొత్త రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని మొదటి, రెండో, మూడో జోన్‌లు, ప్రాణహిత కాలనీ(షిర్కే), నాగార్జున కాలనీ ఏరియాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఆరు నెలల క్రితం అప్పటి చెన్నూర్ ఎమ్మెల్యే రూ.40కోట్ల నిధులతో కాలనీల్లోని రోడ్లన్నీ నిర్మించాలని మూడో జోన్‌లోని రామాలయం వద్ద శంకుస్థాపన చేసినప్పటికీ, పనులు ప్రారంభించే సరికి నాలుగు నెలలు పట్టింది. ఈ లోగా ఎలక్షన్ కోడ్ వచ్చిందని రోడ్ల నిర్మాణ పనులు నిలిపివేశారు.

ప్రభుత్వం జీవో ఉపసంహరించుకోవాలి


సీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయికులు

చెన్నూర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ తర్వాత లభించే లాభాలపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సీడీపీవో మనోరమకు సీఐటీయూ నాయకులు నగేశ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.60వేలు, 60ఏళ్లు దాటిన వారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రవీణ, పద్మావతి, శారద, మణిమాల, విజయలక్ష్మి, భారతి, లలిత, సురేఖ, సావిత్రి, రాజుబాయి, హేమలత, సుగుణ, ఈశ్వరి, సునీత పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపన పూజలు


ప్రతిష్ఠాపన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు

దండేపల్లి: మండలంలోని ద్వారక గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు మంటపారాధన, స్నపనము, పీఠ సంస్కారము, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠాపన, బలిహరణం, నేత్రోన్మీలనం, జయాది హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పోచమ్మను దర్శించుకున్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి

జన్నారం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం బస్టాండ్, గ్యాస్ గోదాం, పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉంటే ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చని అగ్నిమాపక శాఖ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది సతీశ్, శ్రీనివాస్, చంద్రయ్య, పవన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సన్మానం

చెన్నూర్: పట్టణానికి చెందిన కొండపాక చారిని ఇటీవల బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. రాష్ట్ర కార్యవర్గంలో చారికి చోటు దక్కడంపై బీజేపీ జిల్లా, చెన్నూర్ నియోజకవర్గ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా జనరల్ సెక్రెటరీ దుర్గం అశోక్, వట్టి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేశ్, పట్టణ ఇన్‌చార్జి పానుగంటి మధు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకృష్ణ పాల్గొన్నారు.

'మిమ్స్'లో ఎన్ఎస్ఎస్ మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మిమ్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం జనని బ్లడ్ బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది విద్యార్థులు, అధ్యాపక బృందం 50 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఓదేలు, రవికుమార్, బ్లడ్‌బ్యాంకు సంస్థ అధ్యక్షుడు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విస్తృత ప్రచారం

భీమిని/చెన్నూర్‌రూరల్: భీమిని మండలంలోని 172వ బూత్ పరిధిలో, చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం చేపట్టారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భీమినిలో బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, నాయకులు పొట్లపల్లి శేఖర్, కిరణ్, సంతోష్, రాజేష్ పాల్గొనగా, చెన్నూర్‌లో మండల ఇన్‌చార్జి రాపర్తి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, నాయకులు ఆలం బాపు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బోరుబావి సందర్శన


బోరుబావిని పరిశీలిస్తున్న అధికారులు

భీమారం: మండలకేంద్రంలో బోరుబావికి చెందిన స్టార్టర్ పనిచేయడంలేదని, దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఎంపీడీవో రాధరాథోడ్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం ఆమె, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు విద్యాసాగర్‌తో కలిసి బోరుబావిని సందర్శించారు. స్టార్టర్‌ను గ్రామపంచాయతీ ద్వారా కొనుగోలు చేసి పెట్టి, నీటిసమస్యను పరిష్కరించాలని కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎంపీడీవో రాధ ఆదేశించారు.

నూతన కార్యవర్గం


ఇప్ప నరేశ్

నస్పూర్: ఆర్కే- 5 సీఐటీయూ నూతన కమిటీని సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఆర్కే- 5 పిట్ కార్యదర్శిగా ఇప్ప నరేశ్, పిట్ అడ్వైజర్‌గా చిగురి లక్ష్మణ్, షిఫ్ట్ ఇన్‌చార్జులుగా బట్టు నరేందర్, దామెర తిరుపతి, పోతు వెంకటేశ్, తిరుపతిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, కే. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

చెన్నూర్: వాహనాలు నడిపే సమయంలో భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఏడీసీ ఎం. ప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మంచిర్యాల ఆర్టీసీ డీఎం ఆదేశాల మేరకు రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు. కార్లలో ప్రయాణం చేసే డ్రైవర్లు, ప్రయాణికులు సీటు బెల్ట్‌లు ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శేఖర్‌రెడ్డి, సేఫ్టీ వార్డెన్ జీఆర్ మౌళి, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే ప్రకటించాలని పేదరిక నిర్మూలన పోరాట సమితి (పీఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ కే.వై ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద దళితులకు దళితబంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందుకోసం పేదరిక నిర్మూలన పోరాట సమితి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పేదరిక నిర్మూలన పోరాట సమితి బెల్లంపల్లి అధ్యక్షురాలు వేమర్ల శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీల వాటా అమలు చేయాలి


మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

మందమర్రిరూరల్: చట్టసభల్లో బీసీలకు రావాల్సిన పదవుల్లో వాటా అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బీసీ ప్రజా చైతన్య ముగింపు యాత్ర సోమవారం మందమర్రి చేరిన సందర్భంగా నాయకులు స్థానికంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ వీధుల్లో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దేశంలో బీసీల కులగణన చేసి అధిక శాతం జనాభా ఉన్న బీసీలకు రావాల్సిన సామాజిక, రాజకీయ వాటా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పోలు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు రంగు రాజేశం, కనుకుంట్ల మల్లయ్య, మిట్ట లక్ష్మణ్, రాజిరెడ్డి, ముత్తయ్య, గాండ్ల సంజీ, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని తొలగింపజేస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 64లో అక్రమ నిర్మాణం, అనుమతిలేని వెంచర్‌లోని హద్దురాళ్లను డీటీఎఫ్ టీం సభ్యులు సోమవారం జేసీబీ సాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వంశీకృష్ణ గెలుపునకు కృషి చేయాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

మందమర్రిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఎలాంటి విభేదాలున్నా, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ తరుపున ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు పిలుపునిచ్చారు. తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీనే భారీ మెజార్టీతో గెలిచిందని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలంతా వంశీకృష్ణ గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేస్తున్నారని తెలిపారు. మాజీ సర్పంచులు, పట్టణ, మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం వాయిదా

చెన్నూర్: పట్టణంలోని ఎంఆర్ఆర్ గార్డెన్‌లో ఈ నెల 16న మంగళవారం ఉదయం 10గంటలకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అధ్యక్షతన జరిగే చెన్నూర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు గమనించాలని కోరారు.

'నవోదయ'కు ఎంపిక

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరుకు చెందిన ఐదో తరగతి విద్యార్థి షవాలే రోషన్ జవహార్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు మదర్‌తెరిస్సా పాఠశాల ప్రిన్సిపాల్ జోబీ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆర్కే-6 33/11 సబ్‌స్టేషన్ పరిధిలోని శ్యాంనగర్, సంగం మల్లయ్య పల్లి, ఓల్డ్ ఆంధ్రబ్యాంకు ఏరియా, లక్ష్మీనగర్, గాంధీనగర్, చర్చ్ ఏరియా, సుభాష్‌నగర్, ప్రశాంత్‌నగర్, కృష్ణా కాలనీ, పిట్టలకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


జైపూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేక్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జైపూర్: మండలం ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మిట్టపల్లి, ముదిగుంట, టేకుమట్ల, బెజ్జాల గ్రామాలతో పాటు ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.

జన్నారం: మండలంలోని బంగారు తండాకు చెందిన 100 మంది గిరిజన లంబాడ తండా వాసులు సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పాలనలో తండాలు అభివృద్ధి చెందుతాయని, పార్టీ గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తుందనే నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరినట్లు నిర్మల బాయి, జలపతి, జగదీశ్, అరవింద్, తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం పాల్గొన్నారు.

పంటల రక్షణకు చి'వరి' ప్రయత్నం



పంటలు చేతికందే సమయంలో ఎండలకు వ్యవసాయ బావుల్లో నీళ్లు అడుగంటి పోతున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దండేపల్లి మండలం ధర్మరావుపేట సమీపంలో ఓ రైతు తన వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటిపోవడంతో తాను సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలకు నీళ్లందించడం కోసం చివరి ప్రయత్నంగా బావిలో పూడిక తీయించాడు. ఇలా ఈ ఒక్క రైతే కాదు.. చాలా మంది రైతులు ఇలా బావుల్లో పూడిక తీయించి, పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

\- దండేపల్లి

నిధుల చెల్లింపుల్లో జాప్యం..!


అరెపల్లి పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్డి

భీమారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్వశిక్ష అభియాన్ పథకం కింద 2014-15 సంవత్సరంలో విద్యాకమిటీల ద్వారా మరుగుదొడ్లు నిర్మించినా.. ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని విద్యాకమిటీ సభ్యులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కొత్తగూడెం, ఆర్కెపల్లి పాఠశాలలతో పాటు నర్సింగాపూర్ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకోసం మరుగుదొడ్లు మంజూరు కాగా, ఒక్కోదానికి రూ.1.20లక్షలు అని ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. కమిటీల ద్వారా వీటిని నిర్మించగా, ఇప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అప్పులు చేసి మరుగుదొడ్లు నిర్మించామని మాజీ విద్యాకమిటీ సభ్యులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని మరుగుదొడ్లకి డబ్బులు చెల్లించాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

దేవాపూర్‌లో అంబలి పంపిణీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సోమవారం కొక్కిరాల రఘుపతిరావు జ్ఞాపకార్థంగా అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్మీదేవర తల్లి పట్నాలు, బోనాలు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల రంగంపేట్‌లో లక్ష్మీదేవర తల్లి పట్నాలు, బోనాలు సోమవారం ఘనంగా జరిగాయి. లోక కల్యాణం జరిగే పూజలో భక్తులు పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ సునిత-కిషన్‌లు పూజలో పాల్గొని ఆలయ నిర్వహణ నిమిత్తం రూ.5వేలు విరాళం ఇచ్చారు.

నియామకం

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన గాదె అరుణ్‌ను చెన్నూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా నియమిస్తూ సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి నియామకపత్రాన్ని అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

దండేపల్లి: పోలీస్‌స్టేషన్ సమీపంలో అరుణ ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లోని క్రికెట్ టీం క్రీడాకారులకు ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ బుక్యా రాజ్‌కుమార్ సోమవారం టీ షర్టులను పంపిణీ చేశారు.

ఆలయ కమిటీ ఎన్నిక

తాండూర్: మండలంలోని బోయపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా దుకుం తిరుపతి, వైస్ చైర్మన్‌గా సుదర్శన్‌ను ఎన్నుకున్నారు.

నీటి సమస్య రాకుండా చూడాలి

జన్నారం: ఎండల తీవ్రత పెరుగుతున్నందున నీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీడీవో, చింతగూడ గ్రామ ప్రత్యేక అధికారి శశికళ అన్నారు. చింతగూడ గ్రామంలో సోమవారం పర్యటించారు. గ్రామంలో పనిచేయని చేతి పంపులను బాగు చేయించారు.

పుస్తె, మట్టెలు అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పేదింటి ఆడపిల్ల శ్రావణి పెళ్లికి గాను జిల్లా ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం పుస్తెలు, మట్టెలు, చీర సంప్రదాయమైన సౌభాగ్యంను అందించారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర

మందమర్రిరూరల్: పట్టణంలో హనుమాన్ భక్తులు పాలచెట్టు వద్ద గల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మార్కెట్, పుర వీధుల గుండా ఆంజనేయ స్వామి విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు.